# నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
12 | నిజామాబాద్, శనివారం 25 జనవరి 2025 | KAMAREDDY


## నేడు జిల్లాకు బీఆర్ఎస్ రైతు అధ్యయన కమిటీ

**మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి**



మోర్తాడ్, జనవరి 24: రైతు ఆత్మహత్యలపై ఏర్పాటైన బీఆర్ఎస్ అధ్యయన కమిటీ నేడు జిల్లాలో పర్యటించనున్నదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో రైతు అధ్యయన కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కమిటీ సభ్యులు శనివారం నిజామాబాద్ జిల్లాలో పర్యటిస్తారని వేముల తెలిపారు. ఉదయం 10 గంటలకు మెండోరా మండలం బుస్సాపూర్‌లో రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం అర్గుల్‌లో రైతుల సమస్యలు తెలుసుకుంటారని వివరించారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## కాంగ్రెస్‌పై ఒత్తిడి తెచ్చేందుకే..

**మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్**



జక్రాన్‌పల్లి, జనవరి 24: మండలంలోని అర్గుల్‌లో బీఆర్ఎస్ రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ శనివారం పర్యటించనున్నదని రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన 9 మంది సభ్యులతో కూడిన కమిటీ రైతు కుటుంబాలతో పాటు రైతుసంఘాల నాయకులను కలిసి వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై చర్చిస్తుందన్నారు. వాటి పరిష్కారానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. రైతులపై అక్రమ కేసులు పెట్టడం తప్ప వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు అండగా ఉండేందుకు అధ్యయన కమిటీ రాష్ట్రంలో నెల రోజులు పర్యటన చేయనున్నదని తెలిపారు.

### హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం



ఉచిత హామీలను గుప్పించి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఏడాది గడిచినా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. రేవంత్ పాలనపై ప్రజలు విసుగు చెందారు. రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలి.

**- జైడి భాస్కర్‌రెడ్డి, రైతు, అర్గుల్**

### ప్రజాపాలన కాదు.. అవినీతి పాలన



కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడుస్తున్నది ప్రజాపాలన కాదు.. అవినీతి పాలన. రైతులకు ఇప్పటివరకు రైతు భరోసా ఇవ్వలేదు. రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేస్తుండు. ఆరు గ్యారెంటీలు అమలు కావట్లేదు. గ్రామసభల్లో ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలి. లేకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదు.

**- అల్లూరి సాయన్న, రైతు, అర్గుల్**

**పదేండ్ల పాటు సంతోషంగా** ఉన్న కర్షకుల జీవితాలు కాంగ్రెస్ రాకతో ఆగమయ్యాయి. ఏడాది పాలనలోనే ఎన్నో కష్టాలు వెంటాడాయి. పదేండ్ల పాలనలో కేసీఆర్ అన్నదాతలకు అండగా నిలిస్తే.. రేవంత్ సర్కారు రైతులను గాలికొదిలేసింది. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ, నిరంతర విద్యుత్‌తో పాటు ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాలు నిర్మించి సాగునీరు అందించారు. రైతుబంధు ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం అరకొరగా రుణమాఫీ చేసి సగానికంటే ఎక్కువ మంది కర్షకులకు 'చేయి'చ్చింది. సర్కారు మద్దతు లేకపోవడంతో ఏడాది పాలనలోనే వ్యవసాయం తిరోగమన బాట పట్టింది. పెట్టుబడి రాక, గిట్టుబాటు దక్కక, అప్పుల పాలై అన్నదాతలు అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. ఈ క్రమంలో కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న కర్షకులకు అండగా నిలిచేందుకు గులాబీ దండు కదిలింది. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పాటైన రైతు ఆత్మహత్యలపై అధ్యయన కమిటీ నేడు జిల్లాలో పర్యటించనున్నది. బుస్సాపూర్, అర్గుల్‌లో నేరుగా అన్నదాతలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకోనున్నది.

–నిజామాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### సాగుకు కేరాఫ్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా..

నిజామాబాద్, కామారెడ్డి ప్రధానంగా వ్యవసాయాధారిత ప్రాంతాలు. ఉభయ జిల్లాల్లో 5.39 లక్షల మంది రైతులు 10.55 లక్షల ఎకరాల్లో వైవిధ్యమైన పంటలు సాగు చేస్తున్నారు. నిజామాబాద్‌లో 2.60 లక్షల మంది 5.40 లక్షల ఎకరాల్లో, కామారెడ్డిలో 2,79,352 మంది 5.15 లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. వరి, పసుపు, మక్కజొన్న, పత్తితో పాటు కూరగాయలు, పప్పు దినుసులు సాగు చేస్తున్నారు. అంకాపూర్ లాంటి ఆదర్శవంతమైన గ్రామం ఎల్లలుదాటి గుర్తింపును సైతం దక్కించుకున్నది. ఎర్రజొన్న సాగు నిజామాబాద్ జిల్లాకే సొంతం. మూడు పంటలు పండించే రైతులు కూడా ఈ ప్రాంతంలో ఉన్నారు. రైతులకు మేలు చేయాల్సిన కాంగ్రెస్.. రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వలేదు. ఎరువులు, నిరంతర కరెంట్, పంటల కొనుగోళ్లు, బోనస్ వర్తింపు ఇలా ఒకటేమిటి అనేక హామీలను విస్మరించిన రేవంత్ సర్కారు రైతులను నిండా ముంచింది.



- జిల్లాలో నేడు అధ్యయన కమిటీ పర్యటన
- బుస్సాపూర్, అర్గుల్‌లో రైతులతో ముఖాముఖి
- కాంగ్రెస్ పాలనలో ఆగమైన అన్నదాత
- భరోసా లేకుండా పోయిన కర్షకులు
- రుణమాఫీ కాకపోవడంతో తీవ్ర మనోవేదన
- రైతు ఆత్మహత్యలపై అధ్యయనం చేస్తున్న బీఆర్ఎస్ కమిటీ
- మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో టూర్
- ఉమ్మడి జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు చోటు

# రైతు కోసం..

**కదిలిన బీఆర్ఎస్ దండు**

**దేశానికి అన్నం** పెట్టే ఏకైక వ్యక్తి రైతు. చెమట చుక్కను ధార పోసి పండించిన పంటను సమాజ శ్రేయస్సు కోసం అందించే గొప్ప కష్టజీవి అన్నదాత. అలాంటి వారికి అండ ఉంటే ఎన్నో అద్భుతాలు సృష్టించగలరు. ప్రపంచానికే ఆదర్శంగా నిలువగలరు. వ్యవసాయ రంగంలో భవిష్యత్తును ముందే ఊహించి రైతన్నలకు మేలు చేయాలనే దృఢ సంకల్పంతో తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన భారీ మార్పులు కర్షకులకు కొండంత ప్రయోజనకరంగా మారాయి. ప్రధానంగా ప్రభుత్వ ఆర్థిక చేయూత రైతు కుటుంబాల్లో జీవన భరోసాను నింపాయి. రైతుబీమా అన్నదాత కుటుంబానికి భద్రత కల్పించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్ర పాలకుల నిర్లక్ష్యం కారణంగా కుదేలైన తెలంగాణ వ్యవసాయ రంగాన్ని కేసీఆర్ పట్టాలెక్కించారు. పంటల సాగులో కష్టాలను శాశ్వతంగా పారదోలి అన్నదాతలకు అండగా నిలిచారు. కానీ, కాంగ్రెస్ రాకతో మళ్లీ ఆనాటి చీకటి రోజులు పురుడు పోసుకున్నాయి. ప్రభుత్వ సాయం నిలిచి రైతులు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. రేవంత్ సర్కారు గద్దెనెక్కిన నాటి నుంచి మూడు పంట సీజన్లు గడిచాయి. కానీ పెట్టుబడి సాయం పత్తా లేకుండా పోయింది. దీంతో అన్నదాతలకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. అప్పులు తీర్చలేక పంట లాభాలను వెచ్చించాల్సిన దౌర్భాగ్యాన్ని రైతులు ఇప్పుడు ఎదుర్కొంటున్నారు. మరోవైపు సమస్యలు చుట్టుముట్టడం మూలంగా వివిధ కారణాలతో, అప్పుల బాధతో రైతులు తనువు చాలిస్తున్నారు.

### లక్షల్లో రుణమాఫీ బాధితులు..

కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు విడుతల్లో కలిపి నూటికి నూరు శాతం రూ.2లక్షల్లోపు రుణాలు మాఫీ చేశామని నవంబర్ 30న ప్రకటించుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. రెండు జిలాల్లో సగం మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. వాస్తవానికి నిజామాబాద్ జిల్లాలో సుమరుగా 2,03,520 మంది అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తించాలి. వీరిలో 1,00,555 మందికి నాలుగు విడుతల్లో రూ.781కోట్లు పంట రుణాలు మాఫీ అయ్యాయి. మిగతా 1,02,265 మంది రైతుల పంట రుణాలు మాఫీ కాలేదు. కామారెడ్డి జిల్లాలో 1.76 లక్షల మంది రైతులు రుణాలు తీసుకోగా, 1,01,417 మందికి రూ.736 కోట్ల మేర రుణమాఫీ వర్తించింది. ఇంకా 75 వేల మందికి రుణమాఫీ కాలేదు. ఏ ప్రాతిపదికన రుణమాఫీ చేవారో ఎవ్వరికీ అర్థం కావట్లేదు. వ్యవసాయమే జీవనాధారమై, అన్ని అర్హతలూ ఉన్న రైతులకు మాఫీ కాలేదు. కానీ, ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రం రుణమాఫీ కావడం గమనార్హం. ఆదర్శ రైతును ప్రభుత్వ ఉద్యోగిగా చూపించి రుణమాఫీ ఎగ్గొట్టిన ఘటన నిజామాబాద్ జిల్లాలోనే వెలుగు చూసింది. అయినప్పటికీ తప్పులు సరి చేయలేదు. అర్హులకు రుణమాఫీ అందించలేదు. తీవ్ర గందరగోళాల మధ్య రుణమాఫీ ప్రక్రియ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో అసంపూర్తిగా మిగిలింది.

### కేసీఆర్ హయాంలో పండుగలా సాగు..

కేసీఆర్ పాలనలో పంటల సాగు పండుగలా సాగింది. 24 గంటల పాటు నిరంతర విద్యుత్ ఉచితంగా అందించారు. రాత్రి వేళ పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి కరెంట్ తీగలకు, పాము కాట్లకు బలయ్యే పరిస్థితులను కేసీఆర్ మార్చేశారు. పంటలు పండించేందుకు ప్రభుత్వమే సాయం చేసే సంచలన పథకానికి శ్రీకారం చుట్టారు. 2018 మే 10న దేశంలోనే తొలిసారిగా పెట్టుబడి సాయాన్ని కేసీఆర్ ప్రారంభించారు. 11 విడుతల్లో వేల కోట్ల రూపాయలను రైతుబంధు కింద అన్నదాతలకు అందజేశారు. ఒక్కో సీజన్‌కు ఉమ్మడి జిల్లాలో సుమారుగా 5.50 లక్షల మంది రైతులకు రూ.500 కోట్ల మేర సాయం చేశారు. 2023 వానాకాలంలో నిజామాబాద్ జిల్లాలో 2.60 లక్షల మందికి రూ.265 కోట్లు, కామారెడ్డిలో 2.79 లక్షల మందికి రూ.252.76 కోట్ల మేర పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేశారు. కానీ, కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు ఆగిపోయింది. రెండు పంట కాలాలు పోయినప్పటికీ రైతుభరోసా అమలు కాలేదు. ఎకరానికి రూ.15వేలు ఇస్తామన్న సర్కారు మాట మార్చేసి రూ.12వేలు ఇస్తామంటూ బుకాయిస్తున్నది. పైగా దానికీ అనేక షరతులు పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### బీఆర్ఎస్ అధ్యయన కమిటీ రాక నేడు..

రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై అధ్యయనం కోసం భారత రాష్ట్ర సమితి అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ అధ్వాన పరిస్థితులపై మాజీ మంత్రి నిరంజన్ నేతృత్వంలో 9 మందితో కూడిన కమిటీని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు అధ్యయన కమిటీలో చోటు కల్పించారు. ఈ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి, క్షేత్ర స్థాయిలో నెలకొన్న దుర్భర పరిస్థితులను అధ్యయనం చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రికి, వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌కు నివేదించనున్నది. శుక్రవారం తొలి రోజు ఆదిలాబాద్‌లో పర్యటించిన కమిటీ.. నేడు (శనివారం)నిజామాబాద్ జిల్లాలో అధ్యయనం చేయనున్నది. బాల్కొండ నియోజకవర్గంలోని మెండోరా మండలం బుస్సాపూర్‌లో, జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌లో రైతులతో ముఖాముఖిగా సమావేశం కానున్నది. రైతు ఆత్మహత్యలకు దారి తీస్తున్న ప్రధాన కారణాలతో పాటు గత ఏడాది కాలంగా వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి నివేదికను రూపుదిద్దనున్నారు.

- రుణ ఊబిలో చిక్కుకుని రైతు ఆత్మహత్య
- రోడ్డున పడిన పీర్‌చంద్ కుటుంబం
- కూలీగా మారిన భార్య కళావతి
- దయనీయ స్థితిలో ముగ్గురు పిల్లలు

## పంట ఎండే.. అప్పు మిగిలే..



నవీపేట, జనవరి 24: పదేండ్లుగా పెట్టుబడి సాయం రావడంతో ఆ రైతు జీవితం సాఫీగా సాగిపోయింది. పంట పండినా, పండకపోయినా 'రైతుబంధు'తో అప్పులు చేసే అవసరం లేకుండా పోయింది. అయితే, కేసీఆర్ సర్కారు దిగిపోవడం, రైతుబంధు ఆగిపోవడంతో ఆ రైతు మళ్లీ అప్పు చేయాల్సి వచ్చింది. కానీ కాలం కలిసిరాక పంట ఎండిపోయింది. అదే సమయంలో అప్పులోళ్ల వేధింపులు వెంటాడాయి. దీంతో దిక్కు తోచని స్థితిలో పడిపోయిన ఆ రైతు ఉసురు తీసుకున్నాడు. ఇద్దరు పిల్లలు, భార్య రోడ్డున పడ్డారు. ఇదీ నవీపేట మండలం మట్టయ్యఫారం గ్రామానికి చెందిన రైతు కేతావత్ పీర్‌చంద్ (38) దీన గాథ. ఆయన ఆత్మహత్య ఉదంతం మళ్లీ సమైక్య పాలన నాటి దుస్థితిని కళ్లకు కట్టింది. పీర్‌చంద్‌కు భార్య కళావతి, ముగ్గురు పిల్లలు బాలాజీ, గంగోత్రి, చాలనితో పాటు వృద్ధ తల్లిదండ్రులున్నారు. బతుకు దెరువు కోసం అప్పులు చేసి ఎడారి దేశానికి వెళ్లిన పీర్‌చంద్‌కు అక్కడ కలిసి రాలేదు. దీంతో స్వదేశానికి తిరిగి వచ్చాడు. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన రెండెకరాల భూమిలో పంటలు వేసి భార్య, పిల్లలతో సంతోషంగా గడపాలనుకున్నాడు. ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందక పోవడంతో బ్యాంక్‌తో పాటు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు తీసుకుని సాగు చేశాడు. పరిస్థితులు అనుకూలించక పంట ఎండిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. అదే సమయంలో అప్పు తిరిగి చెల్లించాలని వడ్డీ వ్యాపారుల నుంచి ఒత్తిళ్లు పెరిగాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన పీర్‌చంద్ డిసెంబర్ 15న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

**భార్యపైనే కుటుంబ భారం..**

పీర్‌చంద్ ఆత్మహత్యతో కుటుంబ బాధ్యత భార్యపై పడింది. కుమారుడు, ఇద్దరు కుమార్తెల పోషణ ఆమెకు తలకు మించిన భారంగా మారింది. పీర్‌చంద్ ఆత్మహత్య చేసుకుని 40 రోజులు దాటినా ఆ కుటుంబం ఇంకా కోలుకోలేదు. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకున్న భర్త కానరాని లోకాలకు వెళ్లడంతో కళావతి ఇప్పటికీ జీర్ణించుకోలేక పోతున్నారు. మరోవైపు, నాన్న కోసం చిన్నారులు రోదిస్తుండడం కన్నీళ్లు పెట్టిస్తున్నది.

### కూలీ పనిజేసి పిల్లల్ని పోషిస్తున్న..

మాకున్న రెండెకరాలల్ల పంటలు వేస్తుంటిమి. మొన్న పంట పండలే. సాగుకు తెచ్చిన అప్పులు అట్లనే మిగిలినయ్. ఆ బాధతోని మా ఆయన పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుండు. ఇంటాయన పోవుడితో ఏం జెయ్యల్నో అర్థమైతలేదు. పిల్లల పోషణ కష్టమైతుంది. ఉన్న భూమిల పంటలు ఏద్దామంటే పైసల్లేవ్. సర్కారు నుంచి పైసల్ రాలే. అందుకే పంట ఎయ్యలే. బిడ్డల్ని సాకాలి గదా. కూలీ పనికి పోతున్న. మమ్ముల్ని సర్కారే ఆదుకోవాలె.

**-కళావతి, పీర్‌చంద్ భార్య**







రామారెడ్డి లో అధికారులను నిలదీస్తున్న రైతులు

### రామారెడ్డిలో రసాభాస..

రామారెడ్డి, జనవరి 24: రామారెడ్డిలో నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా జాబితాలో తమ పేర్లు ఎందుకు లేవని గ్రామస్తులు అధికారులను చుట్టుముట్టారు. పేర్లు రాకుంటే మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించగా, ఎన్నిసార్లు చేయాలని ప్రశ్నించారు. మరోవైపు, రుణమాఫీ ఎందుకు కాలేదని రైతులు అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మొదలైన వాగ్వాదం తోపులాటకు దారి తీసింది. పోలీసులు వచ్చి వారిని సముదాయించారు.

## మాకెందుకు రాలే..

- అధికారులపై ప్రజల రుసరుస
- గ్రామసభల్లో ప్రశ్నల పరంపర
- అనర్హులను ఎట్లా ఎంపిక చేస్తారని నిలదీత

**లబ్ధిదారుల ఎంపికలో** జరుగుతున్న అన్యాయాలపై సామాన్యులు గళం విప్పారు. పథకాలు దక్కకుండా పోవడంపై నిరుపేదలు గ్రామసభల్లో నిలదీశారు. రేషన్‌కార్డులు ఎందుకు రాలేదని, ఇందిరమ్మ ఇండ్లకు తమను ఎందుకు ఎంపిక చేయలేదని అధికారులను కడిగి పరేశారు. ఇండ్లు ఉన్నోళ్లకే ఇండ్లు ఇవ్వడమేమిటని, భూములు ఉన్నోళ్లకే ఆత్మీయభరోసా ఎలా ఇస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో సమాధానం చెప్పలేక అధికారులు బిత్తరపోయారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో శుక్రవారం జరిగిన గ్రామసభల్లో కనిపించిన దృశ్యాలివి..

–నమస్తే యంత్రాంగం, జనవరి 24



పచ్చలనడ్కుడ గ్రామ సభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

### కార్పొరేషన్ చైర్మన్‌కు రేషన్ కార్డు

వేల్పూర్, జనవరి 24: రేషన్ కార్డుల జాబితాలో కార్పొరేషన్ చైర్మన్ పేరు రావడంతో స్థానికులు విస్మయానికి లోనయ్యారు. వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో రేషన్‌కార్డుల లబ్ధిదారుల జాబితాను అధికారులు చదివి వినిపించారు. పేదల పేర్లు గల్లంతు కాగా, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అన్వేశ్‌రెడ్డి పేరు ఉండడంతో గ్రామసభ గందరగోళంగా మారింది. కార్పొరేషన్ చైర్మన్ పేరు ఎలా వచ్చిందని గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ చైర్మన్ హోదాలో రేషన్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకుంటాడు.. ఆయనకు రేషన్ కార్డు ఎలా మంజూరు చేస్తారని నిలదీశారు. ఈ అంశంపై జీపీ కార్యదర్శి నవనీత స్పందిస్తూ అనర్హులు ఉంటే వారి పేర్లు తీసేస్తామని చెప్పారు.

### అర్హులకు అన్యాయం..



రాజీవ్‌నగర్ తండాలో నిలదీస్తున్న మహిళ

బోధన్ మండలంలోని ఊట్‌పల్లి, రాజీవ్‌నగర్ తండా, లంగ్డాపూర్ గ్రామసభల్లో అర్హుల పేర్లు రాలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ నగర శివారులోని కేశాపూర్, పాల్దా, మాధవ్‌నగర్, ఖానాపూర్, కాలూర్ గ్రామాల్లో అధికారులను నిలదీశారు. అనర్హులకు పథకాలు కేటాయించి తమకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజసమని ధ్వజమెత్తారు . భీమ్‌గల్ మండలం ముచ్కూర్‌లో అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనర్హులను ఎంపిక చేయడంపై మాక్లూర్ మండలం మాణిక్‌బండార్‌లో అధికారులను నిలదీశారు. రెంజల్‌తో పాటు నవీపేట్ మండలం జన్నెపల్లిలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు రాలేదని, అనర్హులను ఎలా ఎంపిక చేస్తారని నిలదీశారు.



పెద్దకొడప్‌గల్‌లో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనం

### పేదల పేర్లు గల్లంతు..

బాన్సువాడ మండలంలోని తాడ్కోల్, కోనాపూర్, సోమ్లానాయక్ తండాల్లో గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. నస్రుల్లాబాద్ మండలంలోని మైలారంలో ఇండ్లు ఉన్న వారికే ఇండ్లు మంజూరు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో జరిగిన తప్పులపై బీర్కూర్ మండలంలోనూ అధికారులను నిలదీశారు. అర్హులకు అన్యాయం చేశారని నాగిరెడ్డిపేట మండల కేంద్రం గోపాల్‌పేటలో గ్రామ సభను అడ్డుకున్నారు. మహిళలు అధికారుల పైకి దూసుకెళ్లారు. పోలీసులు వచ్చి వారిని అడ్డుకున్నారు. తప్పు చేసిన అధికారులు నెల జీతం వదులుకోవాలని హెచ్చరించారు.



తాడ్కోల్ గ్రామ సభలో దరఖాస్తులు చేసుకుంటున్న గ్రామస్తులు .